# మాధురి

- డి.వి.ఎస్.ఆర్.మూర్తి

రాత్రి పదకొండు గంటలు దాటింది. కాలింగ్‌బెల్ ఎప్పుడు మ్రోగుతుందా అని ఎదురుచూస్తోంది మాధురి. కాని అది మ్రోగలేదు.

భర్త శశి ఇల్లు చేరలేదు. ఏమయ్యాడో అన్న భయం వెంటాడింది. అసలే రోజులు బాగాలేవు. కిడ్‌నేప్‌లు రేపులు ఎక్కువయ్యాయి. ఏక్సిడెంటులూ ఎక్కువయ్యాయి.

ఆ భయం అప్పుడు మాధురికి వింతగ తోచింది. శశి గురించి తాను ఎందుకు భయపడాలి? ఈ ప్రశ్న ఎదురయ్యేసరికి ఆమెకు ఏవేవో గుర్తుకువచ్చాయి. ఆలోచనలు ఎక్కడెక్కడికో లాక్కుపోయాయి.

భార్య భర్తకు ఎందులోనూ తీసిపోదు. అందుకే భర్తతోపాటు సమానంగా ఉద్యోగం చేయాలి. డబ్బు సంపాదించాలి. దానితో భార్య జీవితం స్వర్గం. అదే మాధురి నమ్మింది.

''నీకు ఏమీ తెలియదు డాడీ'' అంది మాధురి. ''నీవు బి.సి.లో ఉండవలసినవాడవు.''

'ఔనా?' అన్నాడు తండ్రి గోపాలకృష్ణ నిజమే అన్నట్లు. ''నీమాటలు వింటూంటే నాకు ఆశ్చర్యంగా ఉంది.''

''ముందుకు సాగుతున్న లోకాన్ని చూడలేకపోయినా దానితో నడవలేకపోయినా అలాగే ఉంటుంది. బూజుపట్టిన భావాలను నీవు వదలలేకపోతున్నావు. పైగా అవే మంచివి అనుకుంటున్నావు. అందరూ అవే పట్టుకు వ్రేల్లాడాలని పట్టుపడుతున్నావు.''

''అంటే ఆడపిల్లకు చదువు కావాలంటావు. చదువుకుని ఉద్యోగం చేయాలంటావు. మొగవాళ్ళతో సమానమని ఋజువు చేస్తానంటావు.''

''ఋజువు చేయలేనా? ఆడపిల్ల అయితే పెళ్ళి చదువుతో సరిపెట్టుకోవాలి. భార్య అయి వంటింటికి భర్తకు దాసిగ బ్రతకాలా? ఇదెక్కడి న్యాయం?''

''అయితే విమెన్ లిబ్‌లో చేరావు. ఆ చెత్తా చెదారం అంతా మీటింగులలో చెప్పడానికి వినడానికే! ఆదర్శం వేరు. నిజజీవితం వేరు. ఆడపిల్లకు మంచి మొగుడే మంచి జీవితం.''

''కాదు. మంచి ఉద్యోగమే మంచి జీవితం.'' కచ్చితంగా చెప్పింది మాధురి.

''ఈ వెర్రికి కారణం నాకు తెలుసు. ఈనీ చదువులు, నీ స్నేహితులు. నామాట విను.''

''వింటాను డాడీ. కాని ఇప్పుడు కాదు. ముందు డాక్టరును అవుతాను. అప్పుడు నీవు ఎవరిచేత తాళి కట్టించుకోమంటే తలవంచుకుని కట్టించుకుంటాను. సరేనా?''

మాధురికి చెప్పి లాభంలేదని గోపాలకృష్ణ ఊరుకున్నాడు. ఆమె డాక్టరు కావాలనుకోవడానికి కారణం అతడే. డాక్టరుగా గోపాలకృష్ణ పేరు సంపాదించాడు. లక్షలు సంపాదించాడు. హాయిగా ఆనందంగా కాలం గడుపుతున్నాడు. అలా జీవితం దిద్దుకోవడం మాధురి ఆదర్శం.

తదేక దీక్షతో మాధురి పదవ క్లాసు పరీక్షలకు చదివింది. బాగా వ్రాసింది. నూటికి ఎనభై ఏడు మార్కులతో ఉత్తీర్ణురాలయింది.

మార్కులు చూచిన తండ్రి మాధురి మాటకు ఎదురు చెప్పలేకపోయాడు. కావాలని మాధురి బై.పి. గ్రూపు తీసుకుంది.

అయినా గోపాలకృష్ణ పట్టించుకోలేదు. కారణం అసలు మెట్లు ముందే ఉన్నాయి. ఇంటర్ కనీసం సెకండు క్లాసులో ప్యాసు అవ్వాలి. ఎంట్రెన్స్ పరీక్షలో రేంకు సాధించాలి.

ఎన్‌ట్రెన్స్‌లో ముప్పై రెండోస్థానం మాధురి సాధించింది. గోపాలకృష్ణ గర్వించాడు. కళ్ళు తెరిచాడు. చివరి ప్రయత్నం చేసాడు.

''నామాట ఇప్పుడైనా విను'' అన్నాడు గోపాలకృష్ణ కూతురి మనస్సు మార్చడానికి. ''బి.ఏ.లో ఇక్కడ కాలేజీలో చేరు. అది పూర్తి చెయ్యి. మీ అక్కయ్యకు చేసినట్లే నీకూ పెళ్ళి చేస్తా. మీ అక్కయ్య ఎంత సుఖపడుతోందో నీకు తెలుసుకా.''

''ముందు నామాట విను. నేను డాక్టరవుతాను. అక్కయ్యకంటే ఎక్కువ సుఖపడతాను.''

ఇక చెప్పి లాభం లేదని గోపాలకృష్ణ ఊరుకున్నాడు. మాధురికి తన కల పండిందన్న ఆనందం. అతిశయం!

మెడిసిన్ సీటు తెచ్చుకోవడం ఒక ఎత్తు. ప్రతి సంవత్సరం ప్యాసయి డిగ్రీ తెచ్చుకోవడం మరొక ఎత్తు. ఆ విషయం కాలేజీలో చేరగానే మాధురికి తెలిసి, జాగ్రత్తపడింది. రేంకులో యం.బి.బి.యస్. ప్యాసయింది.

ఇక మిగిలింది హౌస్ సర్జన్సీ. అది కూడ మాధురి పూర్తి చేసింది. దానితో తాను చాల గొప్పదానినన్న భావన వచ్చింది. తాను సాధించలేనిది లేదని విర్రవీగింది.

మాధురి హౌస్‌సర్జనుగ చేరినప్పటి నుండి గోపాలకృష్ణ కూతురికి పెళ్ళి సంబంధాలు వెదకడం మొదలుపెట్టాడు.



విజయవాడలో రామనాథం పెద్ద క్రిమినలు లాయరు. డాక్టరు గోపాలకృష్ణ ఎంత పేరు ప్రతిష్టలు డబ్బు సంపాదించాడో అంతకంటే ఎక్కువే లాయరుగా రామనాథం వెనుకవేసాడు. కళ్ళు చెదిరే భవనం. ఎడ తెరిపి లేని ప్రాక్టీసు.

శశి అతడి కొడుకు. అతడు డాక్టరు. యం.ఎస్. చేసి, ప్రాక్టీసు చేస్తున్నాడు.

డాక్టరు గోపాలకృష్ణ అప్పటికే శశి విషయాలు సేకరించాడు. ఎవరు చెప్పినా అతడు బుద్ధిమంతుడని చెప్పారు. ఇక అందచందాల విషయంలో మాధురికి ఎందులోనూ తీసిపోడు. సన్నగా పొడవుగా తెల్లగా ఉంటాడు. ముఖంలో ఏదో ఆకర్షణ. హావ భావాలలో ఏదో హుందాతనం.

పెళ్ళి దేవుడే నిర్ణయిస్తాడు. ఆ నిర్ణయం తెలుసుకోవడానికి మానవుడు ప్రయత్నించాలి. అదే చేసాడు గోపాలకృష్ణ. విషయం కూతురికి చెప్పాడు.

''డాక్టరు అవడమే నాకోరిక'' అంది మాధురి. ''ఇక నా మనస్సు గ్రహించి నీవే ఇంకొక డాక్టరును పెళ్ళి చేస్తానంటే అంతకంటే నాకు కావలసింది ఏముంటుంది? ఇప్పుడు నీ ఇష్టమే నా ఇష్టం.''

పెళ్ళిచూపులు పూర్తి అయ్యాయి.

మాధురికి శశి బాగా నచ్చాడు. కారణం అతడిని ఆమె ఇంటర్‌వ్యూ చేయడమే. తాను అడిగిన ప్రశ్నలకు శశి తనకు నచ్చే సమాధానాలు చెప్పాడు. వాటిలో శశి పెద్ద డాక్టరు అయినా గీర లేదు. సౌమ్యుడు. తెలివైనవాడు అనే నిర్ణయానికొచ్చింది.

అతడిని పెళ్ళి చేసుకుంటే మాధురికి ఏలోటూ ఉండదు. పైగా ఇద్దరూ నర్సింగ్‌హోము పెట్టవచ్చు. పేరు ప్రతిష్టలు వాటితో డబ్బు, దానివెంట సుఖసంతోషాలు ఆమె కళ్ళముందు నాట్యం చేసాయి.

గోపాలకృష్ణ మహావైభవంగా కూతురి పెళ్ళి శశితో జరిపించాడు.



అప్పుడే గోడ గడియారం పన్నెండు గంటలు కొట్టింది. మాధురి వాస్తవంలో పడింది. భర్త ఇల్లు చేరలేదన్న బాధ తిరిగి మనస్సును కలత పెట్టింది.

శశి గురించి ఎందుకు ఎదురుచూచి కంగారుపడుతోందో మాధురికి అర్థం కాలేదు. ఒక్కక్షణం ఆలోచించింది.

భార్యాభర్తల బంధం ఏడడుగుల సంబంధం. నాతి చరామి అంటూ ఇద్దరూ ఎన్నింటికో అక్కడ కట్టుపడతారు. అవి మనస్సులని దగ్గర చేస్తాయి.

కాని శశి ఆ ప్రమాణాన్ని మరిచాడు. లక్ష్మణరేఖ దాటాడు.

అప్పుడు తన జీవితంలో ఏదో అపశృతి మాధురికి వినపడింది. వెంటనే తండ్రి గుర్తుకు వచ్చాడు.

ఏది ఏమైనా తండ్రి ముందు తాను తల వంచకూడదు. భర్తను సరియైన మార్గంలో ఎలా పెట్టాలా అని ఆలోచించింది. అది పెద్ద సమస్యగా తోచలేదు.

దానితో మనస్సు కొంచెం శాంతించింది. శశి ఎక్కడో ఉంటాడు. ఎప్పుడో ఒకప్పుడు ఇంటికి వస్తాడు.

ఆలోచనల మధ్య మాధురి నిద్రలోకి జారుకుంది.

• • •

'శశి ఏమయ్యాడు?' అన్న ప్రశ్న మాధురికి అప్పుడు ఎదురైంది. ఉదయం లేచేసరికి ఏడు గంటలయింది. గబగబా తయారయింది, భర్త జాడ లేదన్న ఆలోచన మనస్సులో ఉన్నా దానిని పట్టించుకునే సమయం లేదు.

పేషెంట్లు నర్సింగ్ హోములో తన గురించి ఎదురు చూస్తారు. తాను డాక్టరు అన్న భావం ముందు మరి ఏ ఆలోచనా నిలవలేదు.

నర్సింగ్ హోములో కాలుపెట్టింది. బయట ప్రపంచాన్నే మరచింది మాధురి. చేతినిండా పని ఉన్నంతసేపూ చింత దూరంగా ఉంటుంది.

ముందు నర్సింగ్‌హోములో ఉన్న పేషెంట్లను చూచింది. తరువాత అవుట్ పేషెంట్లు ఒకరి తరువాత ఒకరు అలా వస్తూనే ఉన్నారు. ఎప్పుడో

## రకరకాల భాషలు

స్కాట్లాండ్‌లోని ఒక స్త్రీ హఠాత్తుగా ఒక వ్యాధికి గురి అయింది. అది ఓ చిత్రమైన వ్యాధి! ఆమె మాతృభాష ఇంగ్లీషు. రాత్రిపూట నిద్రపోవడానికి ముందు ఇంగ్లీషులోనే చక్కగా మాట్లాడింది. తెల్లవారి నిద్రలేచేసరికి స్వచ్ఛమైన ఆఫ్రికన్ భాషలో అనర్గళంగా మాట్లాడసాగింది. నిజానికి ఆ స్త్రీకి అంతకు ముందు ఒక్క అక్షరం కూడా ఆఫ్రికా భాష రాదు. ఆ మహిళ స్వరంలో కూడా కొంత మార్పొచ్చిందనీ, ఇది కొద్దిపాటి స్ట్రోక్ తగలడంవలన జరిగిందనీ వైద్యులు సెలవిచ్చారు. ఆ సమయంలో తమకు తెలియని భాషలను కూడా అనేక మంది మాట్లాడుతూ ఉంటారని వైద్యులు అన్నారు.


## హిచ్‌కాక్!

సస్పెన్స్ పితామహుడు, విఖ్యాత దర్శకుడు హిచ్‌కాక్, మనదేశంలోని సుందర్ బన్స్ గురించి విని, ఒకసారి పశ్చిమ బెంగాల్‌లోగల సుందర్ బన్స్‌ను చూశాడు.

''ఇటువంటి భయంకరమైన ప్రదేశాలనుగానీ, ఏ సమయంలో ఏ మూల నుంచి ఏ దెయ్యం వస్తుందోననే భీతి కలిగించే ఇటువంటి ప్రదేశాలను నేనింత వరకూ చూల్లేదు.'' అన్నాడు హిచ్‌కాక్.

సుందరబన్‌లోని ఆ దట్టమైన అడవుల్లో ఒక హారర్ చిత్రాన్ని చిత్రించాలని భావించాడు. అయితే ఆయనకు ప్రభుత్వం నుంచి పర్మిషన్ లభించలేదు. చూశారా, ఎటువంటి అవకాశం చేజారిపోయిందో, హిచ్‌కాక్ వంటి ఉద్దండుడు మనదేశంలో ఒక చిత్రం చిత్రించే అవకాశం అది! ప్రభుత్వం చేసే మూర్ఖపు పనుల్లో ఇదొకటి!

- కొడిమెల



మూడు గంటలకు నాలుగు మెతుకులు నోట్లో వేసుకుంది. అప్పుడు శశి గుర్తుకు వచ్చాడు.

సాయంత్రం పని తొందరగా ముగించుకుంది. ఎనిమిదిన్నరకల్లా నర్సింగ్ హోము నుండి బయటపడింది. తొమ్మిదింటికి ఇల్లు చేరింది.

సరాసరి మామగారి దగ్గరకు వెళ్ళి శశి జాడలేదన్న విషయం అంతా చెప్పింది. రామనాథం ధైర్యం చెప్పాడు. ఎక్కడెక్కడికో ఫోనులు చేసాడు. కాని కొడుకు సంగతి తెలియలేదు.

దానితో మాధురి గాభరా ఎక్కువైంది. శశికి ఏదో ప్రమాదం జరిగింది. లేకపోతే ఫోనయినా చేసి ఉండేవాడు. తండ్రికి ఫోను చేద్దామనుకుని కూడా ఆ ప్రయత్నం విరమించుకుంది.

శశితో పెళ్ళి జరిగింది. విజయవాడ వచ్చింది. తన జీవితం వడ్డించిన విస్తరిలా ఉంది మాధురికి.

అప్పటికే శశికి నర్సింగ్ హోం ఉంది. దానితో తాను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవలసింది ఏమీ లేదు. ఒక గది తనకు నచ్చినట్లు కన్సల్టింగు రూముగా చేసుకుంది.

తాను నర్సింగ్‌హోమ్‌లో కాలు పెట్టింది మొదలు దాని స్వరూపమే మారింది. తన ప్రతిభ కొద్దిరోజుల్లోనే నలుగురికి తెలిసింది.

పట్టిందల్లా బంగారం అయింది. విజయవాడలోనే కాక ప్రక్క ఊళ్ళలో కూడ మాధురి పేరు మ్రోగింది. చుట్టుపక్కల ఊళ్ళనుండి ఆడవాళ్ళు ఆమె దగ్గర వైద్యం చేయించుకోవడానికి వస్తున్నారు. ఆమెచేత వైద్యం చేయించుకున్న వాళ్ళు ఆమెను మరచిపోరు. పైగా నలుగురు పేషెంట్లను వెంటపెట్టుకు వస్తున్నారు.

దానితో తాను ఉదయం తొమ్మిదింటికి నర్సింగ్‌హోముకు వెళితే అతి కష్టంమీద రాత్రి తొమ్మిదింటికి బయటపడుతోంది. ఇల్లు చేరిన తరువాత భోజనం చేయడంతో ఆమె వళ్ళు ఆమెకు తెలియడంలేదు.

వంట ఇల్లు సర్దుకుని పడకగది చేరేసరికి పదిన్నర. ప్రక్కమీద వ్రాలేసరికే కళ్ళు మూతలు పడడం, శశి ఏదో కబుర్లు చెపుతున్నా వాటిని పట్టించుకునే ఓపిక ఉండకపోవడం. ఇక శుభరాత్రి ముద్దుపెట్టక ముందే నిద్రపోవడం పరిపాటయింది.

ఉదయం లేవడంతోటే హడావుడి. తాను తయారు కావాలి. శశి తయారు కావడానికి సహాయపడాలి. ఇద్దరు కలసి హాస్పిటల్‌కు వెళ్ళడానికి ఉరుకులూ పరుగులూ.

తాను ఒక యంత్రం అయింది. అది కూడా డబ్బు ముద్రణ యంత్రం. పెషెంట్ల నుండి డబ్బు వర్షం కురిసినట్లు కురుస్తోంది. సాయంత్రం డబ్బు లెక్కపెట్టడం కష్టంగా ఉంది.

సంవత్సరం దాటింది. క్రొత్తకారు వచ్చింది. రెండేళ్ళు పూర్తికాకుండానే సొంత భవనంలో నర్సింగ్‌హోం. వెనుక ఇల్లు అమ్మకానికి వస్తే అదీ కొంది. నర్సింగ్‌హోమ్ ఒక వీధిలో సింహద్వారం ఉంటే వెనుక వీధిలో పెరటి ద్వారం!

పోను పోను శశికి పేషంట్లు పల్చబడ్డారు. తనకు పెరిగిపోయారు. శశి పేషెంట్లే అతడిని కాదని తనదగ్గరకు వస్తున్నారు. అది మంచి పరిణామం కాదని తనకు తెలుసు. దానితో భర్త అహం దెబ్బతినకుండా జాగ్రత్త పడింది.

తాను ప్రచండ భానుడిలా వెలుగుతున్న రోజులవి. ఒక రోజు సాయంత్రం అక్కడకు తండ్రి గోపాలకృష్ణ వచ్చాడు. అతడి కళ్ళతో అతడే కూతురి ప్రతిభ చూసాడు. గర్వించాడు.

''నిన్ను నేను అభినందించకుండా ఉండలేకపోతున్నాను.'' అన్నాడు గోపాలకృష్ణ. ''నీవు చాల అదృష్టవంతురాలవు. నీలా అనుకున్నది సాధించడం గొప్ప. నేను ఏదో అనుకున్నాను. కాని ఇప్పుడు నేను తప్పు అని ఒప్పుకోకుండా ఉండలేకపోతున్నాను.''

''నేను ముందే చెప్పానుగా.'' అంది వినయంగా. ''ఈగొప్ప నాది కాదు. నీదే! నీవు చదివించకపోతే నేను ఏం చేయగలను? కనుక ఇందులో తప్పొప్పులు గెలుపు ఓటమిల ప్రశక్తిలేదు.''

''పిల్లల చేతుల్లో తండ్రి ఓడిపోవడం కంటే కావలసింది ఏముంది? ఓటమే గెలుపు అంటే ఇదే!''

అప్పుడే తనకు ఇక తిరుగులేదు అన్న అహం వచ్చింది. తానే నర్సింగ్‌హోమ్ అనుకుంది. కారణం ఊపిరి సలపని పని. అయినా తనకు విసుగులేదు. నవ్వుతూ పేషెంట్లకు ఊరట కలిగిస్తోంది.

తన పని పెరిగిపోవడం శశి పని తగ్గిపోవడం గమనిస్తోనే ఉంది. కావాలనే అతడు పేషెంట్లను తన దగ్గరకు పంపుతున్నాడా అన్న అనుమానం వచ్చింది. ఏదో ఇద్దరి మధ్య దూరం ఏర్పడింది.

ఒకరోజు సాయంత్రం శశి అవసరం వచ్చింది. అతడి కోసం కబురు పంపింది. నర్సింగ్‌హోమ్‌లో ఎక్కడా అతడు లేడు. బయటకు వెళితే చెప్పకుండా వెళ్ళడు.

అప్పుడు తాను భర్త విషయం విచారణ చేసింది. ప్రతిరోజూ సాయంత్రం ఆరుదాటిన తరువాత ఎక్కడకో వెళ్తున్నాడు. ఎవరో అక్కడకు వస్తూనట్లు వాళ్ళతో కలిసి వెళ్తూన్నట్లు తెలిసింది.

ఆరోజు రాత్రి కారులో ఇంటికి వెళ్తూ తాను ఆ విషయం ప్రస్తావించింది. అతడు క్లబ్బుకు వెళ్తున్నట్లు షటిల్ బేడ్‌మింటన్ ఆడుతున్నట్లు చెప్పాడు.

సాయంత్రం ఒక గంట ఆడుకోవడం తప్పులేదు. అందుకే వద్దని తాను చెప్పలేకపోయింది. కాని ప్రాక్టీసు దెబ్బతినకుండా చూసుకోమని హెచ్చరించింది.

శశిలో మార్పు వస్తున్నట్లు గమనించింది. నర్సింగ్ హోమ్ మీద శ్రద్ధ సన్నగిల్లింది. ఇతర కార్యకలాపాలు ఎక్కువయ్యాయి. దానితో తనకు చిరాకు వచ్చింది. అతడిని దారిలో పెట్టడానికి ప్రయత్నించింది.

సాయంత్రం ఆపరేషనులు పెట్టుకుంటోంది. వాటి కోసం అయినా శశి ఉంటాడని. కాని లాభం లేకపోయింది. అతడిలో నిర్లక్ష్యం ఎక్కువైంది. పైగా ఆమె కన్ను కప్పి క్లబ్బుకు వెళ్తున్నాడు. అవసరానికి కూడా దొరకడంలేదు.

పోను పోను క్లబ్బులో ఎక్కువకాలం గడపడం మొదలుపెట్టాడు శశి. రాత్రి తొమ్మిదిన్నర అయినా నర్సింగ్ హోమ్‌కు తిరిగి రావడంలేదు. అతడి కోసం తాను వేచి ఉండే పరిస్థితి వచ్చింది. తనకు కోపం వచ్చింది శశిపై మొదటిసారిగ.

''నాపని అంతా అయిపోయినా మీకు క్లబ్బులో ఆట తెమలడంలేదు.'' అంది తాను శశి రాగానే. తన ముఖంలో కోపం దాచుకోలేకపోయింది.

''ఆడేవాళ్ళు ఎక్కువయ్యారు. కాళీ దొరకడం లేదు. రేపటి నుండి ఆడినా ఆడకపోయినా తొందరగా వచ్చేస్తా. సారీ డియర్!''

మరుసటిరోజు నుండి శశి తనకు చికాకు కలిగించడని ఆశించింది. తరువాత కొద్దిరోజులు అతడు మాట నిలబెట్టుకొన్నాడు. నర్సింగ్‌హోమ్ విషయాలూ పట్టించుకున్నాడు.

బాగుందని తాను ఆనందించకముందే తనకు తిరిగి తలనొప్పి ప్రారంభం అయింది. శశి క్లబ్బునుండి రావడం ఒకరోజు చాల ఆలస్యం అయింది. దానితో అతడికోసం చూడకుండా తాను ఇల్లు చేరింది.

గాడిదలా తాను ఇంటా బయటా చాకిరీ చేస్తోంది. ఆ జ్ఞానం భర్తకు ఉన్నట్లు లేదు. అతడు క్లబ్బులో హాయిగా ఆడుతూ పాడుతూ గడుపుతున్నాడు. ఇంటికి రాగానే శశిని తాను నిలదీసింది.

''బయటికి వెళ్ళిన తరువాత మన చేతిలో ఏమీ ఉండదు. నేను వెళ్ళిపోతానంటే చులకనయిపోతాను.'' శశి తన ఆలస్యాన్ని సమర్థించుకున్నాడు.

''అయితే క్లబ్బుకు వెళ్ళకూడదు.'' తాను తన నిర్ణయం చెప్పింది. ''పనిపాటూ లేనివాళ్ళకు క్లబ్బు. మనలాంటి వాళ్ళకు కాదు.''

''అయితే మానేయమంటావా?''

''వెంటనే మానేయమంటా.''

తన మాట శశి కాదనడు. కాదనలేడు. అప్పటివరకూ తాను గీచిన గీటు దాటలేదు. అందుకే అంత తొందరలో అంత పెద్ద నర్సింగ్‌హోమ్ వాళ్ళ సొంతం అయింది.

ఇక క్లబ్బుకు వెళ్ళడం మానిపించాలి.

ఒక్కసారి మానడం బాగుండదన్నాడు శశి. నెమ్మదిగా మానేస్తానని వాగ్దానం చేసాడు.

కాని వ్యసనం నుండి బయటపడడం మహాకష్టం.

కంగారుపడింది. శశి తన చేయి దాటిపోతే తన పరువు తండ్రి ముందు పోతుంది. తలవంచుకోవలసి వస్తుంది. ఎట్టి పరిస్థితుల్లో అది జరగకూడదు. ఆలోచించి పథకం వేసింది.

ఏది జరుగకూడదని విశ్వప్రయత్నం చేసిందో అది అప్పుడు జరిగింది. గుండె ఝల్లుమంది.

ఎదురుగా తండ్రి గోపాలకృష్ణ ప్రత్యక్షం అయ్యాడు. ఎలా వచ్చాడో ఆశ్చర్యం. ఎందుకు వచ్చాడో అంత కంటే ఆశ్చర్యం. వెనువెంటనే తండ్రికి విషయం తెలిసి వచ్చాడేమో అన్న అనుమానం. ఇక దాచితే విషయం దాగదు.

దానితో అప్పటి వరకూ అణచిపెట్టిన విచారం కట్ట తెంచుకుని పైకి వచ్చింది. అలా అది పెల్లుబికి తనను ముంచెత్తుతుందని ఊహించలేదు. తాను చాల ధైర్యవంతురాలనన్న నమ్మకం.

''డాడీ దేవుడు అన్యాయం చేసాడు'' అంటూ బావురుమంది. వచ్చే ఏడుపును ఆపుకోలేక ముఖాన్ని చేతులలో దాచుకుంది. శశి ఇక తనకు లేడన్న భయం ఆవరించింది. ''ఇక శశి మనకు లేడు డాడీ!''

''పిచ్చి పిల్లా.'' అంటూ గోపాలకృష్ణ తల నిమిరాడు. అప్పుడు కూతురు ముఖం పైకి ఎత్తాడు. ''ఛీ, ఛీ! ఏమిటా ఏడుపు? ఎందుకు? ఊరుకో. శశికి ఏమీ కాదు. కాలేదు.''

మాధురి కొంచం తేరుకుంది. మామగారు తండ్రికి ఫోను చేసి శశి విషయం చెప్పారు. వెంటనే బయలుదేరి కారులో తండ్రి అక్కడ వ్రాలాడు. ఇక తనకు కొండంత ధైర్యం.

మాధురి మనస్సు శాంతించింది. హాయిగా నిద్రపోయింది.

• • •

శశితో విడిపోయి విడాకులు తీసుకుంటే అనుకుంటూ ఇంటికి బయలుదేరింది. అప్పటికి రాత్రి ఎనిమిదిన్నర గంటలు దాటింది.


భర్త ఏమయ్యాడో అన్న భయం పోయింది. కారణం అప్పటికే విసిగిపోయింది. ఒక్కసారి శశి ఎలా తనకు దూరం అయ్యాడో కళ్ళముందు ప్రత్యక్షమయింది.

శశి క్లబ్బుకి వెళ్ళడం మానలేదు. ఆలస్యంగా రావడం కూడ మొదలైంది. దానితో అతడికోసం చూడకుండా తాను ఇల్లు చేరుతోంది. అతడు ఇంటికి రావడం రోజు రోజుకీ ఆలస్యమవుతోంది. ఒక రోజు తాగి కూడా వస్తున్నాడు.

ఏవో కబుర్లు చెప్పి మజ్జిగ తాగించింది. పడుకునేలా చేసింది.

ఆ రాత్రి నిద్రపట్టలేదు. మెదడు నిండా ఆలోచనలు. ఎందుకు త్రాగుతున్నాడా అని ఆలోచించింది. కారణం

## దొంగలు



''హలో శ్రీను, మీ యింట్లో దొంగలు పడ్డారంట కదా! విలువైన వస్తువులు ఏమైనా పోయాయా!'' అడిగాడు రవి.

''అవును. చాలా విలువైన వస్తువులే పోయాయి.''

''నగలా, డబ్బా...'' అడిగాడు రవి.

''అవి రెండూ కాదు. అంతకంటే విలువైనవే. అయిదు కిలోల ఉల్లిపాయలు.''

- కె. సంధ్యారాణి (విశాఖపట్నం)

## అతితెలివి

కానిస్టేబులు ఖైదీకి బేడీలు వేసి కోర్టుకు తీసుకు వెళుతున్నాడు. మార్గమధ్యంలో వర్షం మొదలయింది.

''సార్! మీరు వర్షంలో తడుస్తున్నారు. అందాక ఈ చెట్టుకింద కూర్చోండి. ఈలోగా నేను స్టేషనుకెళ్ళి గొడుగు తీసుకు వస్తాను.'' అన్నాడు ఖైదీ.

''అమ్మా! అంటే... నువ్వు అటు నుంచి అటే పారిపోదామని ప్లాను అన్నమాట. కుదరదు... నేనే వెళ్ళి గొడుగు తెస్తాను. నువ్వు ఇక్కడే చెట్టుకింద కూర్చో'' అంటూ వెళ్ళిపోయాడు కానిస్టేబులు.

- చెంగల కృష్ణమూర్తి (లింగన్నపాలెం)


## వాచీ

బెడ్రూంలో ప్రియునితో గడుపుతున్న ఒక స్త్రీ హఠాత్తుగా భర్త వస్తున్న శబ్దం విని, ఆదర బాదరగా ప్రియుణ్ణి మంచం క్రిందికి తోసేసి, ఏమీ ఎరుగనిదానిలా మంచం మీద పడుకుంది.

బెడ్రూంలోనికి వచ్చిన భర్త టీపాయ్ మీద ఉన్న వాచీని చూసి ''ఈ వాచీ ఎక్కడిది?'' అనడిగాడు.

''జపాన్‌ది'' అని మంచం క్రింద నుంచి జవాబొచ్చింది.

- తిరుమలరాజు రఘువర్మ (దేవుపల్లి)



కనిపించలేదు. భర్త జీవితం ప్రక్కదారి పట్టినట్లుంది. దానితో తన జీవితం పట్టాలు తప్పుతుంది.

ఏదోఒకటి చేసి అతడి త్రాగుడు మానిపించాలి. లేకపోతే అతడితో తెగతెంపులు చేసుకోవాలి.

మరునాడు ఉదయం తాను లేచింది. శశికి ఇంకా హ్యాంగ్ఓవరు వదలలేదు. నర్సింగ్‌హోముకు వచ్చే స్థితిలో లేడు.

సాయంత్రానికి అతడు కొంచం మామూలు మనిషి అయ్యాడు. తాను ఇల్లు చేరేసరికి ఇంకా పడక గది విడవలేదు.

''మనిషికి ఒకమాట'' అంది తాను సరాసరి పడకగదిలోకి వెళ్ళి. ''గొడ్డుకి ఒక దెబ్బ'' తాను కోపం ఆపుకోలేకపోయింది. ''క్లబ్బుకి వెళ్ళనన్నావు. వెళ్తున్నావు.'' తాను మొదటిసారి ఏకవచన ప్రయోగం చేసింది. ''పైగా త్రాగుతున్నావు. నీవు డాక్టరువి. బుద్ధి ఉండాలి.''

''కుమార్ పుట్టిన రోజని బలవంతం చేసారు. అలవాటు లేకపోవడంతో ఇలా జరిగింది. ఇక ఎవరు బలవంతం చేసినా ముట్టుకోను. నీమీద ఒట్టు.''

''నమ్మమంటావా? స్నేహితులు చెడగొడతారు. మనకు తెలివి ఉండాలి. వాళ్ళను విడిచిపెట్టాలి. లేకపోతే నిన్ను నేను విడిచిపెట్టవలసి వస్తుంది.'' అప్రయత్నంగా ఆమాటలు తన నోటివెంట వెలువడ్డాయి.

''అంతపని చేయకు.''

ఏం చెప్పినా సాయంత్రం అయ్యేసరికి క్లబ్బు, స్నేహితులు. వాళ్ళతో త్రాగడం మానలేకపోయాడు. తనకు దూరం అయ్యాడు.

ఇక తన దగ్గర ఉన్న ట్రమ్ప్‌కార్డు ఉపయోగించింది. అతడితో సరసం లేదు. శృంగారం అసలే లేదు. తన ప్రక్కలోనున్న సుఖం లేకుండా చేస్తే తిక్క కుదురుతుంది. అంతే చేసింది.

అంతలో మాధురి ఇల్లు చేరింది. ఆలోచనల నుండి బయటపడింది. తండ్రి ఉన్నాడేమోనని అనుకుంది. కనుపించకపోయేసరికి మామగారి దగ్గరకు వెళ్ళింది.

కొడుకు జాడ ఏమీ తెలియలేదు. అతడూ చేయవలసిన ప్రయత్నం చేసాడు. తన తండ్రి అతడిని వెదకడానికి వెళ్ళాడు. అతడు తప్పక భర్తను పట్టుకుంటాడు.

అంతలోనే గోపాలకృష్ణ వచ్చాడు. శశి స్నేహితులందరి దగ్గరకు వెళ్ళాడు. ఎవరికీ అతడి సంగతి తెలియదు.

''డాడీ, పోనీలే.'' అంది మాధురి ప్రశాంతంగా. ''డోంట్‌వర్రీ. నో ప్రాబ్లమ్.'' అప్పటికి భర్త రాలేదన్న ఆరాటం పోయింది. ''నేను అక్కరలేదనుకుని ఎక్కడో హాయిగా కాలక్షేపం చేస్తున్నవాడి కోసం బాధపడకూడదు.''

''అలా ఉండాలి'' అన్నాడు మెచ్చుకుంటూ గోపాలకృష్ణ. ''మనం నిమిత్తమాత్రులం. ఎలా జరుగవలసి ఉంటే అలా జరుగుతుంది. అంతా మన మంచికే అని దేన్నైనా ఆహ్వానించాలి.''

తండ్రి వేదాంతం మాధురికి నచ్చింది. లేచింది. అప్పటికే బల్లమీద అన్నీ సిద్ధంగా ఉన్నాయి. తండ్రితో కలసి తృప్తిగా భోజనం చేసింది. ఏదో పిచ్చాపాటీ మాట్లాడుతూ మాధురి హాయిగా నిద్రపోయింది.

మేళకువ వచ్చేసరికి తెల్లారింది. ప్రక్కన చూసింది. తండ్రి లేడు. ఇల్లంతా వెదికింది. చెప్పకుండా ఎక్కడకు వెళ్ళాడా అని ఆలోచించింది. పనిలో పడింది. కాఫీ పెట్టింది. త్రాగిన తరువాత ఫలహారం తయారుచేసింది. స్నానం కూడ అయింది. అలంకరణ పూర్తి చేసుకుంది.

అప్పుడు ఏదో కారు పోర్టికోలో ఆగిన శబ్దం. కొద్ది క్షణాలలో తండ్రి ప్రత్యక్షం అయ్యాడు. అతడి వెనుక శశి. మాధురి తన కళ్ళను నమ్మలేకపోయింది.

''ఎక్కడ పట్టుకున్నావు?'' మాధురికి ఆశ్చర్యంగా ఉంది. ''నీవే పట్టుకున్నావా?''

''నేను పట్టుకోలేదు. నీకారు పట్టుకుంది. కాదు పట్టించింది.''

''నాకారా? వింతగా ఉందే!''

''వింతకాదా?'' అంటూ జరిగిందంతా పూసగ్రుచ్చినట్లు చెప్పాడు. ఉదయాన్నే లేచి ఊరంతా తిరగడం మొదలుపెట్టాడు. తిరుగుతూ తిరుగుతూ పట్టణం పొలిమేర చేరాడు. అది వీవర్సు కాలనీ.

ఒక ఇంటి ముందు కారు కనుపించింది. అది చూడగానే కూతురి కారేమో అని అనుమానం వచ్చింది. కారు ఆపాడు. దిగి కారు చూస్తే తను అనుకున్నది నిజం అయింది.

వెళ్ళి తలుపు తట్టాడు. ఒక యువతి తలుపు తీసింది. శశితో అర్జంటు పని ఉంది మాట్లాడాలి అన్నాడు. కొద్ది క్షణాలలో శశి వచ్చాడు.

మామగారిని చూచి నిర్ఘాంతపోయాడు. దొంగలా ముఖం పెట్టాడు.

ఏమి ఆలోచించుకున్నాడో శశి తెలియదు. అతడితో మాట్లాడకుండా లోపలికి వెళ్ళాడు. కొద్ది నిముషాల తరువాత వచ్చాడు. ఇద్దరూ బయలుదేరారు.

''ఎవరితో ఇన్నాళ్ళూ ఉన్నాడు?'' మాధురి అడిగింది.

''రోటరీవాళ్ళు ఒక వైద్య శిబిరం పెట్టారు. దానిలో డాక్టరుగా శశి చేరాడు. నర్సుగా ఒక అమ్మాయి చేరింది. ఇద్దరూ కలిసి పని చేసారు. దగ్గరయ్యారు.

''అంటే రాత్రులు ఆ నర్సు ఇంట్లో గడుపుతున్నాడన్నమాట.''

''అన్నమాట కాదు. ఉన్నమాటే. నేను వెళ్ళకపోతే ఇప్పుడూ రాడు.''

''నేను త్రాగుబోతే అనుకున్నాను. తిరుగుబోతు కూడా!''

''ఆ నరుసు నీ పెళ్ళాంకంటే బాగుందా? ఆ తుమ్మదుంగతో సరసమా? ఆ బొంత కాకితో శృంగారకేళా? ఛ! ఛ!! సిగ్గుండాలి.''

''ఎందుకు తీసుకువచ్చావు? అక్కడే ఉండనీయలేకపోయావా?''

ఎన్ని అంటున్నా శశి నోరు మెదపలేదు. హావభావాలుండని బొమ్మలా కూర్చుని అంతా వింటున్నాడు. దానితో మాధురి కోపం తారస్థాయికెళ్ళింది.

''ఇక ఒక్కక్షణం నేనిక్కడ ఉండను. మనం రాజవరం పోదాం. ఒక లారీ చూడు. నా సామాను తీసుకుపోదాం. అక్కడ కోర్టులో విడాకులకు పడేస్తాను.'' మాధురి నిర్ణయం ప్రకటించింది.

శశి అప్పుడూ పెదిమ కదపలేదు. అయిపోయిందానికి క్షమించమనలేదు. దానితో గోపాలకృష్ణ బయటకు వెళ్ళాడు. అల్లుడు అలా మారిపోతాడని కాని అలా బెల్లం కొట్టిన రాయిలా ఉండిపోతాడని కాని ఊహించలేదు. ఏదో ఇద్దరి మధ్య రాజీ చేద్దాం అనుకున్నాడు. కాని వీలుపడలేదు.

లారీలోకి సామానంతా ఎక్కించారు. మాధురి తండ్రితో కలసి వీధిలోకి రావడం లారీ బయలుదేరడం జరగాలి.

వీధి గుమ్మం దాటబోతుండగా రామనాథం వచ్చాడు. ''ఆగు మాధురి'' అన్నాడు. ఒక్కసారి ఆమె తలఎత్తి అతడి ముఖంలోకి చూసింది. ఆమెకు అతడంటే గౌరవం భక్తి.

''విడిపోవడం క్షణంలో జరుగుతుంది'' అన్నాడు రామనాథం. ''కలవడం కల అవుతుంది. రెండు చేతులూ దగ్గరకు చేరిస్తేనే చప్పట్లు! శశి తప్పు చేసాడు. మానవుడు తప్పు చేస్తాడు. దేవుడు క్షమిస్తాడు.''

మాధురికి అడుగు ముందుకు పడలేదు. మామగారి ప్రతిమాటా ఆలోచింపచేసాయి.

ఉద్యోగం చేసి డబ్బు సంపాదించేస్తే పురుషుడితో సమానం. ఇది కాదని శశి ఋజువు చేసాడు. హోదా డబ్బు భార్యకు అందమైన జీవితం. ఇదీకాదని తన జీవితం తనకు చెప్పింది. నిజమైన జీవిత మాధురి వాటిలో లేదు. అసలు అది బయట ప్రపంచంలో లేదా?

ఆ క్షణంలో మాధురి మనస్సు వెనుతిరిగింది. అంతర్ముఖం అయింది. అప్పుడు తెలిసింది. అప్పటివరకూ తాను త్రాగింది మత్తెక్కించే మాధురి. అది బయట ప్రపంచంలో దొరుకుతుంది. జీవిత మాధురి తనలోనే ఉంది.

''ఏమిటి? ఆలోచనలోపడ్డావా?'' గోపాలకృష్ణ మాటలు మాధురిని వాస్తవంలోకి తెచ్చాయి. ''నీకు అందం ఉంది. డబ్బు ఉంది. హోదా ఉంది. అవి ఉంటే స్త్రీ పురుషునితో సమానమేనా?''

''డాక్టరుగా నేను డాక్టరు శశికి సమానమే. కాని మా సంబంధం వేరు. భార్యాభర్తలం. మనసులు వికసించినప్పుడే సంబంధాలు అనుబంధాలు అవుతాయి!''

డాక్టరుగా తను బిజీ అయ్యి, శశిని అశ్రద్ధ చేయబట్టే అతను బయట సుఖం కోసం వెంపర్లాడుతున్నాడన్న సత్యాన్ని మాధురి ఆ క్షణంలో ఆలస్యంగా గ్రహించింది! అందుకు తప్పు దిద్దుకుంది!

★